మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్
- పెద్దచింతకుంటలో ఎయిడ్స్, డ్రగ్స్‌పై విద్యార్థుల అవగాహన ర్యాలీ



నర్సాపూర్ రూరల్: పెద్దచింతకుంటలో అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్



చిన్నశంకరంపేట కళాశాల డ్రగ్ నివారణ కమిటీకి ఎన్నికైన అధ్యాపక, విద్యార్థి బృందం

నర్సాపూర్ రూరల్: ఎయిడ్స్‌తో పాటు డ్రగ్స్‌ను తరిమికొట్టాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దామోదర్ యువతీ, యువకులకు పిలుపునిచ్చారు. బుధవారం నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో మండలంలోని పెద్దచింతకుంటలో ఎయిడ్స్, డ్రగ్స్ నిర్మూలనపై ర్యాలీ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, మద్యపానం, ధూమపానం వంటి వాటికి అనేకమంది యువతీ యువకులు బానిసలుగా మారి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరి కొంతమంది రకరకాల వ్యసనాలకు బానిసలై ఎయిడ్స్ వంటి రోగాల బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా యువతి, యువకులు మత్తు ఇతర చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితువు పలికారు. గ్రామస్థాయి వరకు డ్రగ్స్, ఎంజాయ్ వంటి పదాలు చేరుకోవడంతో అనేకమంది జీవితాలు దుర్భర స్థితికి చేరుకున్నాయన్నారు. ఎవరైనా డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు బానిసలైతే ఇతనే 1908 నంబర్‌కు ఫోన్ ఫిర్యాదు చేయాలని తెలిపారు. ర్యాలీ అనంతరం గ్రామపంచాయతీ వద్ద మానవ హారంగా ఏర్పడి, పెద్ద ఎత్తున ఎయిడ్స్, డ్రగ్స్‌ను తరిమికొట్టాలంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేశ్‌కుమార్, ఏఎస్ఐ స్వరూపరాణి, ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 2ల అధ్యాపకులు శ్రీనివాస్, అనిత, రమేశ్, హేమంత్, విద్యార్థులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీ

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల యాంటీ డ్రగ్ కమిటీని ఏర్పాటు చేశారు. యాంటీ డ్రగ్ కమిటీ చైర్మన్ ప్రిన్సిపాల్ శశిధర్, కోఆర్డినేటర్‌గా రసాయన శాస్త్ర అధ్యాపకులు అనిల్ కుమార్, సభ్యులుగా కళాశాల విద్యార్థులు పల్లవి, మధుమిత, భానుతేజ, మహేందర్ నియామకం అయినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. పోలీస్‌ల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేస్తామని తెలిపారు. డ్రగ్స్ నిర్మూలనకు అవసరమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ మెరుగైన సమాజం కోసం భాగస్వాములం అవుతామన్నారు.

విలువైన జీవితం కోల్పోకూడదు



సదస్సులో మాట్లాడుతున్న యాంటీ డ్రగ్స్ నార్కోటెక్స్ డీఎస్పీ పుష్పకుమార్

తూప్రాన్: విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యాంటీ డ్రగ్స్ నార్కోటిక్స్ డీఎస్పీ పుష్పకుమార్ అన్నారు. పట్టణంలోని గీతా కాళశాలలో మత్తు పదార్థాల నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌కి బానిసైతే విలువైన జీవితం కోల్పోవాల్సి వస్తుందన్నారు. తూప్రాస్ సీఐ రంగాకృష్ణ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు రవాణా, అమ్మకాలపై పోలీసు విభాగం నిఘా పెట్టామని, ఎక్కడైన వాటి విక్రయాల గురించి తెలిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాంటీ డ్రగ్స్ నార్కోటిక్స్ ఎస్ఐ రాము, ఎస్ఐ శివానందం, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు



బండపోతుగల్‌లో ఇసుక కుప్పలను సీజ్ చేసిన తహసీల్దార్ ముసాద్దీక్, తదితరులు

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మంజీరా వాగు నుంచి ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ముసాద్దీక్ అన్నారు. బుధవారం ఆయన రెవెన్యూ సిబ్బంది, పోలీస్ శాఖ సహకారంతో మండలంలోని బండపోతుగల్ గ్రామంలో పలువురు ఎలాంటి అనుమతులు లేకుండా, అక్రమంగా డంప్ చేసి ఉంచిన సుమారు 13 ఇసుక కుప్పలను (50 ట్రాక్టర్ల లోడ్) సీజ్ చేశారు. ఈ సందర్భంగా ముసాద్దీక్ మాట్లాడుతూ.. బండపోతుగల్ గ్రామంలో పలువురు వ్యక్తులు మంజీరా వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలించి, ఆ ఇసుకను డంప్ చేసి వ్యాపారం చేసుకుంటున్నారన్నారు. విశ్వసనీయ సమాచారం అందడంతో గ్రామంలో సోదాలు నిర్వహించి, డంప్ చేసి ఉంచిన ఇసుకను సీజ్ చేశామన్నారు. సీజ్ చేసిన ఇసుకను ఈ నెల 7న ఉదయం 11:30 గంటలకు వేలం వేయనున్నామని, ఆసక్తి ఉన్నవారు రూ. 5 వేల డీడీని తహసీల్దార్ చిలప్‌చెడ్ మండల్ పేరు మీద డీడీ తీసుకొని శుక్రవారం లోగా తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సునీల్‌సింగ్, పంచాయతీ కార్యదర్శి ఆనంద్, సిబ్బంది భానుచందర్, భూపాల్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల పరిశీలన



సీసీరోడ్డు కొలతలు పరిశీలిస్తున్న ఎస్ఆర్‌పీ జీవన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని గ్రామాలలో ఉపాధి హామీ నిధులతో పూర్తిచేసిన పనులకు సామాజిక తనిఖీలో భాగంగా అధికారులు పరిశీలించారు. బుధవారం చిలప్‌చెడ్, గంగారం, బండపోతుగల్ గ్రామాల్లో ఉపాధిహామీ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలను ఎస్ఆర్‌పీ జీవన్ ఆధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా జీవన్ మాట్లాడుతూ.. గ్రామాల్లో జరిగిన ఉపాధి హామీ నిర్మాణాల కొలతలు, వాటికి చేసిన ఖర్చులు పూర్తి వివరాలు నమోదు చేసుకొని, గురువారం మండల కేంద్రంలో నిర్వహించే ప్రజావేదికలో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్ఏఈ మధుబాబు, బీఆర్ఎస్ నాయకుడు దుర్గారెడ్డి, కార్యదర్శులు ఆనంద్, నాగరాజు, డీఆర్‌పీ ప్రభాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలు అమ్మడం నేరం

- వాహనాలు, హోటళ్లు తనిఖీ



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

నర్సాపూర్: డ్రగ్స్, గంజాయి లాంటి మత్తు పదార్థాలు అమ్మడం, సేవించడం నేరమని సీఐ జాన్‌రెడ్డి అన్నారు. ఆయన తన సిబ్బందితో పాటు నార్కోటిక్ డాగ్‌తో కలిసి మంగళవారం రాత్రి జాతీయ రహదారిపై వాహనాలు తనిఖీ చేశారు. పట్టణంలోని పలు హోటళ్లు, పాన్ దుకాణాలు సైతం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిషేధిత మత్తు పదార్థాలు కల్గి ఉండడం నేరమని చెప్పారు. నిషేధిత మత్తు పదార్థాలు దొరికితే శిక్ష కఠినంగా ఉంటుందన్నారు. పట్టణంలోని హోటళ్లు, పాన్‌దుకాణాల్లో నార్కోటిక్ డాగ్‌తో కలిసి తనిఖీ చేశామని, అనంతరం వాహనాలు తనిఖీ చేసి వ్యాపారులకు, వాహనదారులకు నిషేధిత మత్తు పదార్థాలపై అవగాహన కల్పించామని వివరించారు. తనిఖీల్లో ఎస్ఐ లింగం, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఆర్డీఓ రమాదేవి

టేక్మాల్(మెదక్): బొంపల్లి రాజయ్య ఉపాధ్యాయ వృత్తిలో సమాజానికి అందించిన సేవలను మరువలేనివని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. రాజయ్య జ్ఞాపకార్థం మండలంలోని కాదులూర్ గ్రామంలో ఆయన కుమారుడు అనిల్ ఆధ్వర్యంలో ఉమ్మడి మెదక్ జిల్లా వాలీబాల్ టోర్నమెంట్‌ను ఆర్డీఓ ప్రారంభించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ మధుసుదన్, రిటైర్డ్ డిప్యూటీ డీఈఓ సుధాకర్, తహసీల్దార్ తులసీరాం, టేక్మాల్ ఎస్ఐ రాజేశ్, జోగిపేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భక్తుల వీరప్ప, నాయకులు మాన్‌కిషన్, విష్ణువర్ధన్‌రెడ్డి, పాపయ్య, కిషోర్, మజహర్, రాందాస్, భాస్కర్, అవినాష్, సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల సంరక్షణపై వ్యాసరచన పోటీలు

హవేళిఘణాపూర్(మెదక్): వన్యప్రాణుల సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని పోచారం అభయారణ్యం వద్ద విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వన్యప్రాణుల సంరక్షణకు తీసుకోవాల్సిన అంశాలపై బూర్గుపల్లి హైస్కూల్ విద్యార్థులకు టీవీలో జంతువులను చూపిస్తూ డీఎఫ్‌వో జోజీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓ స్రవంతి, బీట్ ఆఫీసర్లు రాము, ప్రియాంక, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులకు క్రీడాపోటీలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రంలో దివ్యాంగులకు క్రీడాపోటీలు నిర్వహించారు. బుధవారం ఐఈఆర్‌పీ (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసర్చ్ పర్సన్) ఆధ్వర్యంలో వివిధ క్రీడాపోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ బాలరాజు, విద్యాశాఖ ఫిజియోథెరపి డాక్టర్ స్వప్న, హెచ్ఎంలు సాజిద్‌అలి, ఓంప్రకాశ్, ఐఈఆర్‌పీలు పద్మ, స్వరూప, సీఓ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న కూలీలు

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రంలోని ఫీల్డ్ అసిస్టెంట్ సక్కుబాయి, ఆమె భర్త గంగారంపై చర్యలు తీసుకోవాలని ఉపాధికూలీలు ఎంపీడీఓ చంద్రశేఖర్, ఏపీఓ సుధాకర్‌లకు బుధవారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అల్లాదుర్గం ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌కి బదులుగా ఆమె భర్త పనులు చేయిస్తూ ఇష్టారాజ్యంగా పేర్లపై హాజర్లు వేసుకొని డబ్బులు తీసుకుంటున్నారన్నారు. ఏమైనా పని అడిగితే బూతులు మాట్లాడుతూ.. ఎవ్వరికి చెప్తారో చెప్పుకొండి అంటూ నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. పని చేయకుండా, చేస్తున్నట్లు హాజర్లు వేసుకొని డబ్బులు తీసుకుంటున్నారని వాపోయారు. వెంటనే అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ వసతిగృహాల్లో మెరుగైన వసతులు



విద్యార్థినులతో భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వ వసతిగృహాల్లో మెరుగైన వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గూడూర్‌లో ఉన్న కస్తూర్బా వసతిగృహన్ని కాంగ్రెస్ నాయకులతో పరిశీలించి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. హాస్టల్‌లో నెలకొన్న పలు సమస్యలను ప్రిన్సిపాల్ మంజుల వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రమేశ్‌గౌడ్, వెంకటేష్, శ్రీనివాస్‌గౌడ్, నగేశ్, తిరుపతి రాథోడ్, ప్రహ్లాద్‌చారి ఉన్నారు.

బీజేపీని విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నిజాంపేట(మెదక్): ఆరు గ్యారెంటీ అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, బీజేపీని విమర్శించే స్థాయి ఆ నాయకులకు లేదని ఆ పార్టీ మండలాధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో విఫలం అయిందన్నారు. గుమ్మడి కాయల దొంగలు అంటే భుజాలు తరుము కున్నట్టు అభివృద్ధి గురించి మాట్లాడితే వాళ్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, నిజాంపేట మాజీ జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్, కార్యకర్తలను విమర్శించడం సరికాదన్నారు. బీజేపీని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. పెన్షన్ పెంపు, రైతులందరికీ రుణమాఫీ, రైతు భరోసాపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు సంతోష్‌గౌడ్, సిద్ధారాంరెడ్డి, నరేందర్, ప్రణయ్ కుమార్, ఎస్టీ మోర్చా అధ్యక్షుడు కిషన్ నాయక్, సంజీవ్, పోచయ్య, అమర్, స్వామి, ఎల్లం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

పెద్దశంకరంపేట(మెదక్): ఉద్యోగ, ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం వెంటనే అమలు చేయాలని తెలంగాణ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ మండలాధ్యక్షుడు హరీశ్ కుమార్ అన్నారు. బుధవారం పేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీపీఎస్ ఉపాధ్యాయులు తెలంగాణ కాంట్రాక్ట్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ కరపత్రం వారు ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 1, 2004 తర్వాత నియామకమైన ఉపాధ్యాయులకు సీపీఎస్ విధానాన్ని అమలు చేయడం వల్ల రెండు లక్షల 50 వేల మంది ఉద్యోగ ఉపాధ్యాయులకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికలకు ముందు చ్చిన హామీ మేరకు పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రహరీని కూల్చిన వ్యక్తి రిమాండ్

నర్సాపూర్ రూరల్: పట్టా భూమిలో ప్రహరీని కూల్చిన వ్యక్తిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నర్సాపూర్ ఎస్ఐ లింగం బుధవారం తెలిపారు. నర్సాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్ద చింతకుంట గ్రామానికి చెందిన పత్రాల యాదగౌడ్ అనే వ్యక్తి హైదరాబాద్‌కు చెందిన మారగాని నాగయ్య నాగ మురళీకృష్ణకు ఏడేళ్ల క్రితం విక్రయించాడు. మురళీకృష్ణ తాను కొనుగోలు చేసిన భూమి చుట్టూ ప్రహరీని నిర్మించుకున్నారు. యాదగౌడ్ తమ్ముడు ప్రభుగౌడ్, అతని కుమారుడు ఆనంద్‌తో కలిసి అక్రమంగా జేసీబీతో ప్రహరీని ధ్వంసం చేశారు. బాధితుడి ఫిర్యాదుతో ఇద్దరి వ్యక్తులపై కేసు నమోదు చేశారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

నేడు డైట్‌సెట్ ధ్రువపత్రాల పరిశీలన

హవేళిఘణాపూర్(మెదక్): అనివార్య కారణాలతో గతంలో ధ్రువపత్రాల పరిశీలనకు రాని వారు సంబంధించిన సర్టిఫికెట్లతో గురువారం హవేళిఘణాపూర్ డైట్ కళాశాలలో హాజరు కావాలని డైట్ ప్రిన్సిపాల్ రమేశ్‌బాబు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో కొందరు విద్యార్థులు అనివార్య కారణాలతో రాని వారికి ఈ అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.

యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడిగా నాగరాజు



రామాయంపేట(మెదక్): యువజన కాంగ్రెస్ రామాయంపేట మండలాధ్యక్షుడిగా మండలంలోని ప్రగతి ధర్మారం గ్రామానికి చెందిన నాగరాజు నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ జిల్లా నాయకులు ఉత్తర్వులు జారీ చేశారు. తనపై నమ్మకంతో ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని ఈసందర్భంగా నాగరాజు హామీ ఇచ్చారు.

చిన్నశంకరంపేట మండలాధ్యక్షుడిగా భరత్



చిన్నశంకరంపేట(మెదక్): మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా చెన్నాయిపల్లి గ్రామానికి చెందిన భరత్ రామ్ యాదవ్ ఎన్నికయ్యారు. బుధవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ కు కృతజ్ఞతలు తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన

కౌడిపల్లి(నర్సాపూర్):మండలంలోని వెల్మకన్న, కొట్టాల తదితర గ్రామాల్లో పోలింగ్ బూత్‌లను ఎంపీడీఓ శ్రీనివాస్ బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వివిధ గ్రామాల్లోని పోలింగ్ బూత్‌ల్లో సౌకర్యాలు, సమస్యలను పరిశీలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బలరాం, హెచ్ఎం సరోజ, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాల్య వివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విజన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలకు దూరంగా ఉంటామంటూ విద్యార్థులతో ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలతో జరిగే నష్టాలను తెలిపారు. కార్యక్రమంలో విజన్ ప్రతినిధి కైలాష్, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు సహకరించాలి

వెల్దుర్తి(తూప్రాన్): రాయరావు సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఇంటర్మీడియట్ బోర్డు పరీక్షలకు ఇంకా 90 రోజుల సమయం మాత్రమే ఉందన్నారు. అందులో 67 రోజులు కళాశాల పని దినాలు ఉన్నాయని, విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి తల్లిదండ్రులు సహకరించాలన్నారు.

పొట్టు లారీకి జరిమానా



పొట్టు లారీని పట్టుకున్న పోలీసులు

సాక్షి ఎఫెక్ట్..

శివ్వంపేట(నర్సాపూర్): నిబంధనలకు విరుద్ధంగా ప్రధాన రోడ్లపై వెళ్తున్న పొట్టు లారీల గురించి సాక్షి దినపత్రికలో పలుమార్లు కథనాలు ప్రచురితమైంది. దీంతో ఎస్ఐ మధుకర్‌రెడ్డి స్పందించి బుధవారం తూప్రాన్ – నర్సాపూర్ హైవేపై సిబ్బందితో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. బాడీ కంటే కంటే అదనంగా ఇరువైపుల పొట్టుని నింపి రవాణా చేస్తున్న డీసీఎం వాహనాన్ని అడ్డుకొని జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా పొట్టుని రవాణా చేసి వాహనాలపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఎస్ఐ మధుకర్‌రెడ్డి తెలిపారు.

గుజిరితండాలో సామాజిక తనిఖీ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గుజిరితండాలో సామాజిక తనిఖీ నిర్వహించి, బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశామని ఎస్ఆర్‌పీ జీవన్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో నిర్వహించిన ఉపాధి పనుల విషయమై నెల రోజులుగా సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. గ్రామంలో జరిగిన ఉపాధి పనులకు అయిన ఖర్చులకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాకేశ్‌నాయక్, పంచాయతీ కార్యదర్శి శిల్ప, డీఆర్‌పీ వీణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆశాలకు కనీస వేతనం ఇవ్వాలి



కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశావర్కర్లు

మెదక్ కలెక్టరేట్: ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశావర్కర్ల యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు నర్సమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించి నిరసన తెలిపారు. అనంతరం అదనపు కలెక్టర్ నగేష్‌తో పాటు డీఎంహెచ్ఓ శ్రీరామ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా గ్రామాల్లో సేవలు అందిస్తున్న ఆశాలకు ఇప్పటికీ ఫిక్స్‌డ్ వేతనం లేకపోవడం అన్యాయం అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు బాలమణి, జిల్లా కార్యదర్శి సావిత్రి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నిక



నియామక పత్రాన్ని అందుకుంటున్న మధులత

నర్సాపూర్: జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎంపీడీఓ మధులత ఎన్నికయ్యారు. ఇటీవల మెదక్‌లో జరిగిన జిల్లా గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఎన్నికలు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో జరిగాయని ఆమె తెలిపారు. గెజిటెడ్ ఆఫీసర్స్ సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని మధులత చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ నిధుల దుర్వినియోగం

అల్లాదుర్గం(మెదక్): మండల పరిధిలోని బహిరంగ దిబ్బ గ్రామంలో పంచాయతీ నిధులు గ్రామ కార్యదర్శి, గ్రామ ప్రత్యేక అధికారి కలిసి దుర్వినియోగం చేశారని గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బుధవారం గ్రామ పంచాయతీలో గ్రామసభ నిర్వహించారు. ఎంబీ రికార్డు లేకుండా నిధులు ఎలా డ్రా చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నామమాత్రంగా పనులు చేపట్టి కార్యదర్శి నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు వారు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శి ఇష్టారాజ్యంగా విధులు నిర్వహిస్తున్నారని వారు మండి పడ్డారు. గ్రామపంచాయతీ నిధులపై కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో చంద్రశేఖర్, ఇన్‌చార్జి ఎంపీఓ లింగప్ప తెలిపారు.

◆ ప్రజా పాలన విజయోత్సవాల ర్యాలీ

మెదక్‌మున్సిపాలిటీ: ప్రజాపాలన వియోత్సవాల్లో భాగంగా బుధవారం మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం నుంచి రాందాస్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, సిబ్బంది, పాల్గొన్నారు.

◆ నాణ్యమైన భోజనం అందించాలి

నర్సాపూర్ రూరల్: వసతి గృహాల్లో ఉండే పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ మధులత సిబ్బందికి సూచించారు. బుధవారం సాయంత్రం మండలంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల, కళాశాల, జక్కపల్లి మోడల్ స్కూల్, కళాశాలల వసతి గృహాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. తాజా కూరగాయలతో పాటు నాణ్యమైన పౌష్టికాహారం విద్యార్థులకు అందించాలని సూచించారు.

◆ మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా సంగమేశ్వర్‌గౌడ్



టేక్మాల్(మెదక్): మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా వరుసగా 2వసారి కుసంగి గ్రామానికి చెందిన సంగమేశ్వర్‌గౌడ్ బుధవారం ఎన్నికైనట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ, మండల నాయకులకు సంగమేశ్వర్‌గౌడ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

◆ సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులకు లబ్ధిదారులకు బుధవారం అందజేశారు. ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో మంజూరైన చెక్కులను పిల్లుట్ల, ఎదుల్లాపూర్, గంగాయిపల్లి గ్రామాల్లో బీఆర్ఎస్ నాయకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, నాయకులు పవన్‌గుప్తా, దామోదర్‌రెడ్డి, స్వామి, మాజీ ఎంపీటీసీ నాగమణి, మాజీ ఉప సర్పంచ్ మహేశ్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

◆ 7 నుంచి క్రీడలు

కౌడిపల్లి(నర్సాపూర్): సీఎం కప్ క్రీడలు శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ బాలరాజు తెలిపారు. బుధవారం ఎంఆర్‌సీ కార్యాలయంలో మండల పీడీ, పీఈటీలతో సీఎం కప్ క్రీడాపోటీల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పీడీ రమేశ్, పీఈటీలు పాల్గొన్నారు.

◆ సీఎం కప్‌ను విజయవంతం చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న సీఎం కప్ 2024ను విజయవంతం చేయాలని మాసాయిపేట మండల విద్యాధికారి లీలావతి అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడల సన్నాహాక సమావేశం నిర్వహించారు.

◆ ప్రకృతిని పరిరక్షించుకోవాలి

శివ్వంపేట(నర్సాపూర్): ప్రకృతిని అందరూ కలిసి పరిరక్షించుకోవాలని మల్లారెడ్డి యూనివర్సిటీ బీఎస్సీ విద్యార్థినులు స్నేహ, శైలజ, సింధు. శిరీష, శృతి అన్నారు. డిసెంబర్ 5న మట్టి దినోత్సవం సందర్భంగా బుధవారం మండలంలోని చెన్నాపూర్ గ్రామంలో గ్రామస్తులకు, విద్యార్థులకు అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. రైతులు సేంద్రియ సాగు చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి శోభరాణి పాల్గొన్నారు.

◆ నేడు బాలమేళా

నర్సాపూర్: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం బాలమేళా కార్యక్రమం యాదవ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేశామని సీడీపీఓ హేమ భార్గవి తెలిపారు.